క్లుప్తంగా

కంటి ఆపరేషన్లకు 45 మంది ఎంపిక



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణుడు

కుప్పం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించి ఉచిత కంటి వైద్య శిబిరంలో 45 మంది ఆపరేషన్ కోసం ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో 100 మంది కంటి రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆపరేషన్‌కు ఎంపిక చేసిన వారికి బెంగళూరులోని శంకర్ కంటి ఆస్పత్రిల్లో ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో శంకర కంటి ఆస్పత్రి వైద్యులు శివప్రకాష్, రాహుల్, సాయిమాత సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తప్పిదాలు చేస్తే శిక్ష తప్పదు



కల్లూరులో మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న రామకృష్ణశాస్త్రి

పులిచెర్ల(కల్లూరు): మద్యం షాపుల్లో పనిచేసే సిబ్బంది చిన్న తప్పిదాలు చేసినా శిక్ష తప్పదని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణశాస్త్రి హెచ్చరించారు. ఆదివారం మండలంలోని కల్లూరు, పులిచెర్లలోని మద్యం దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. వచ్చిన స్టాకును ఎప్పటికప్పుడు సిబ్బంది సరిచూసుకోవాలన్నారు. అధిక ధరలకు అమ్మితే కేసు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది లోకనాథం, నాగరాజు పాల్గొన్నారు.

అసెస్‌మెంట్ టాపర్లకు అభినందన



బాలికోన్నత పాఠశాల టాపర్స్‌తో ఎంఈఓ

పలమనేరు: విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మొదటి అసెస్‌మెంట్ పరీక్షల మార్కుల్లో తొలి మూడు స్థానాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను స్థానిక ఎంఈఓ లీలా రాణి అభినందించారు. ఆదివారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో పోటీతత్వం పెరిగి, బాగా చదివేందుకు ఆస్కారం ఉంటుందని ఆమె అన్నారు.

ఎమ్మెల్సీ షేక్‌సాబ్జి మృతికి సంతాపం



పుంగనూరు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎమ్మెల్సీ షేక్‌సాబ్జికి పలువురు ఘన నివాళులు అర్పించారు. ఆదివారం స్థానిక ఎంఆర్‌సీ భవనం వద్ద ఆయన చిత్రపటానికి యూటీఎఫ్ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించారు. ఎమ్మెల్సీ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సభ్యులు రామచంద్ర, రమణ, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, షబ్బీర్, రహీమ్, లోకనాథరెడ్డి, రామయ్య, సూర్యప్రకాష్, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలకోవెల పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

పలమనేరు: జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి రచించిన తెలకోవెల కథాసంపుటి పుస్తకాన్ని పట్టణంలోని కళామందిరంలో ఆదివారం ఆవిష్కరించారు. కవితశ్రీ, కృష్ణమూర్తి పుస్తకాన్ని పరిచయం చేశారు. ప్రముఖ కవి కేఎస్వీ మాట్లాడుతూ మానవత్వంతో నిండి మనిషిని చైతన్యం చేసే రచనలను చేయాల్సిన అవసరం ఇప్పటి రచయితలపై ఉందన్నారు. సామాజిక స్పృహ కలిగిన పుస్తకాలు చాలాకాలం గుర్తుంటాయన్నారు. పుస్తకాన్ని పూర్తిగా చదివేయాలనిపించే కథనం అందులో మూల వస్తువుగా ఉండాలన్నారు. తెల కోవెలలో గ్రామీణ జీవన పరిస్థితులను రచయిత కళ్లకు కట్టినట్లు చూపారన్నారు. అనంతరం శ్రీరామచంద్రమూర్తి దంపతులను స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు తులసీనాథం నాయుడు, పుష్ప ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు ఆముదాల మురళి, అరుణ కుమారి, పలమనేరు బాలాజి తదితరులు పాల్గొన్నారు.

జోష్ నింపిన బస్సుయాత్ర

- కార్యక్రమం విజయవంతంతో నేతల్లో ఆనందం
- కార్యకర్తల్లో నూతనోత్సాహం



శనివారం పలమనేరు బస్సుయాత్రకు భారీగా హాజరైన జనం (ఫైల్)

పలమనేరు: పలమనేరులో రెండ్రోజుల క్రితం జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్ర సూపర్ సక్సెస్ కావడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్‌ను నింపింది. గతంలో రెండు పర్యాయాలు ఈ బస్సుయాత్ర వివిధ కారణాలతో వాయిదా పడటం విదితమే. తర్వాత తేదీ ఖరారు కావడంతో సభకు విజయవంతం చేయడానికి ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆయా మండలాల నేతలతో ఎప్పటికప్పుడు మాట్లాడారు. ఊహించని దానికంటే ఎక్కువగా జనం సభకు రావడంతో క్యాడర్‌లో ఉత్తేజాన్ని నింపింది. వచ్చే ఏడాది ఎన్నికలు రానున్న నేపథ్యంలో బస్సుయాత్ర పార్టీకి బూస్టప్‌నిచ్చిందని స్థానికంగా పలువురు చర్చించుకోవడం కనిపించింది. నెల రోజులుగా ఆయా పంచాయతీల్లో వై ఏపీ నీడ్స్ జగన్, జగనన్నకు చెబుదాం, జగనన్న ఆరోగ్య సురక్ష, మెగా జాబ్‌మేళా, నిరుపేదలకు భూపంపిణీ, ఆడుదాం ఆంధ్రా, మసీదులకు శాశ్వత పట్టాల పంపిణీ..ఇత్యాది కార్యక్రమాలతో పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జనంతో మమేకమవుతూనే ఉన్నారు. ఇలా ఎమ్మెల్యే ప్రజలకు బాగా దగ్గర కావడంతోనే సామాజిక సాధికార యాత్రకు జనం స్వచ్ఛందంగా హాజరైనట్లు రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు నిత్యం ఏదో ఓ కార్యక్రమంతో గ్రామాలకు వెళుతూనే ఉన్నారు. దీన్ని గమనించి ఎక్కడ తమకు గ్రాఫ్ పడిపోతుందనే భయంతో ఇక్కడి మాజీ మంత్రి అమరనాథరెడ్డి సొంతంగానే ఇంటింటికీ తెలుగుదేశం పేరిట అక్కడక్కడ కొన్ని గ్రామాలకు వెళ్లడం చేస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే ప్రతిపక్షాలు సైతం వైఎస్సార్ సీపీ దారిలో వెళుతున్నాయనేది అర్థమవుతోంది.

బోస్ చేరికతో వైఎస్సార్ సీపీకి లాభం

2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా సుభాష్ చంద్రబోస్, ఆయనకు ప్రత్యర్థిగా వైఎస్సార్‌సీపీ నుంచి అమరనాథ రెడ్డి పోటీపడ్డారు. టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన అమర్ స్వల్ప మెజారిటీతో బయటపడ్డారు. అయితే ఆపై టీడీపీలో బోస్‌కు తగిన ప్రాధాన్యత లేకుండా అమరనాథ రెడ్డి చూడడంతో ఆయన పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. ఇటీవల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసి మూడ్రోజుల క్రితం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో ఆయన చేరారు. చేరిన వెంటనే సాధికార సభలో పాల్గొన్నారు. పార్టీలతో పనిలేకుండా బోస్‌కున్న వర్గం ఆయన వెనుకే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన చేరిక వైఎస్సార్‌సీపీకి మేలు చేస్తుందనే మాట పట్టణంలో వినిపిస్తోంది. బోస్ టీడీపీని వీడి మాజీమంత్రి అమర్‌పై పలు విమర్శలు చేసినా ఆ పార్టీ నుంచి మౌనమే సమాధానమైంది. దీన్నంతా గమనిస్తున్న జనం బోస్ ఆలస్యమైనా మంచి పని చేశారనే చర్చ మొదలైంది. ఏదేమైనా సామాజిక సాధికార బస్సుయాత్ర నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి



బీసీల ఆత్మీయ సమావేశంలో వివిధ కులాల ప్రతినిధులు

- ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షుడు పూసల రవి

పలమనేరు: జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లను కల్పించాలని ఏపీ అత్యంత వెనుకబడిన కులాల సంఘ అధ్యక్షులు పూసల రవి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని లయన్స్‌సేవా కేంద్రంలో నియోజకవర్గంలోని బీసీల కులాల ప్రతినిధులతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఇన్నేళ్లకు కులగణన చేయడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూనుకోవడం ఆనందంగా ఉందన్నారు. దీనిమూలాన కులాల వారీగా జనాభా లెక్క పక్కాగా తేలుతుందన్నారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు రాజకీయ అవకాశం కల్పించే దిశగా కేంద్రంలోని బీజేపీ ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ పాలనలో బీసీలకు ప్రాధాన్యత పెరగడం హర్షణీయమన్నారు. అయితే ఇంకా అత్యంత వెనుకబడిక కులాల సామాజిక, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడాల్సి ఉందన్నారు. బీసీలంతా సంఘటితంగా ఉంటూ ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ కులాల ప్రతినిధులు హరి, గురుమూర్తి, కృష్ణప్ప, గిరిధరమూర్తి, సుదర్శన్, శంకర్, వెంకటేష్, హరినాథ్, గిరి, మనోహర్,మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

మృతులకు ఎమ్మెల్సీ నివాళి



యువకుల మృతదేహాలకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం రూరల్: శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల మృతదేహాలకు ఆదివారం చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ సందర్శించి నివాళులు అర్పించారు. తొట్లిమ్మగుడికి చెందిన అభిషేక్, బంగారునత్తంకు చెందిన ప్రవీణ్ మృతి చెందడం విదితమే. మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. యువకులు వాహనాలు నడిపేటప్పుడు తమ కుటుంబాలను గుర్తు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వేగం వల్ల యువకెవరూ దుర్మరణం పాలు కారాదని, అలా జరిగితే కుటుంబాలకు తీరని దుఃఖమేనన్నారు.

గుత్తార్లపల్లెలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన



విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కుప్పం: మండలంలోని గుత్తార్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు.ఈ ప్రదర్శనలో విద్యార్థులు 52 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో 9 ప్రాజెక్టులు ఉత్తమమైనవిగా ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు సుజాత తెలిపారు. ఈ తొమ్మిది ప్రాజెక్టులను మంగళవారం మండల స్థాయిలో జరిగే ప్రదర్శనలో ప్రదర్శించనున్నట్లు ఆమె తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

బైరెడ్డిపల్లె: స్థానిక చెక్‌పోస్టు కూడలిలోని రాయల్ మహల్‌లో ఆదివారం నిర్వహించిన కళాతరంగిణి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కళాకారులు, విద్యార్థులు జానపద, నృత్య, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనతో తమ ప్రతిభను చాటుకున్నారు. కళాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళా తరంగిణి సంస్థ వ్యవస్థాపకులు రాజేష్‌బాబు, ఎస్‌ఐ మోహన్‌కుమార్, ఎంఈఓ-2 సుబ్రమణ్యం, న్యాయనిర్ణేతలు సంధ్య, మస్తాన్, బాలాజి, సంస్థ సభ్యులు సురేష్, అశోక్, శివ, నాగరాజు, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో విశ్వశాంతి





ప్రబోధానంద రచించిన పుస్తకాలపై ప్రచారం నిర్వహిస్తున్న ప్రతినిధులు, పలమనేరు మండలంలో..

కుప్పం రూరల్: భగవద్గీత పఠనంతో విశ్వశాంతి సాధ్యమని ప్రబోధానంద సేవా సమితి కుప్పం ప్రతినిధి కృష్ణ అన్నారు. ప్రబోధానంద రచించిన పుస్తకాలపై ఆదివారం మండలంలోని పరకుంట్లపల్లె, జరుగు గ్రామాల్లో ప్రచారం చేశారు. కృష్ణ మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా భగవద్గీత పఠనం చేయవచ్చని, భగవద్గీత పఠనంతో శాంతి, జ్ఞానం, సౌభాగ్యం కలుగుతుందని పేర్కొన్నారు. ధనుర్మాసం చాలా ప్రాముఖ్యత కలిగిందని, ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పూజలు చేయాలని కోరారు. అనంతరం ప్రబోధానంద రచించిన పుస్తకాలను గ్రామీణులకు పంచారు. ప్రబోధానంద సేవా సమితి సభ్యులు కృష్ణమూర్తి, దేవరాజు, ప్రకాశ్, వెంకటలక్ష్మి, జలజాక్షి, యశశ్విని పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత ప్రచారం

పలమనేరు: పట్టణానికి చెందిన త్రైత సిద్ధాంత ప్రచారకులు ఆదివారం మండలంలోని జరావారిపల్లెలో భగవద్గీతపై ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను ప్రజలకు పంపిణీ చేశారు. శ్రీకృష్ణ పరమాత్ముడు సమాజానికి స్నేహితునిలా మంచిని నేర్పారని పేర్కొన్నారు. మార్గశిర మాస ప్రత్యేకతను వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భాస్కర్, బాలాజి, జ్యోతి, వాణిశ్రీ, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం



పెన్షనర్లను సన్మానిస్తున్న అసోసియేషన్ నేతలు

పుంగనూరు: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో అఖిల భారత పెన్షనర్ల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు చెంగారెడ్డి, కార్యదర్శి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గురురాజారావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు సి.నారాయణరెడ్డి, భరత్ భూషణ్, వేణుగోపాలయ్య, విజయ్‌మొదలి, హేమాద్రి, ద్వారకమ్మ, రెడ్డెప్పరెడ్డి, జయపాల్ మొదలి, చంద్రశేఖర్, రాజమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

దారి ఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు



దారిలో ఆక్రమణదారులు పోసిన మట్టి

రామకుప్పం: స్థానిక పాత ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే దారి వివాదాస్పదంగా మారింది. శతాబ్దకాలంగా ఆస్పత్రికి వెళ్లడానికి దారి ఉంది. అంతేగాక ఆసుపత్రి చుట్టుపక్కల సుమారు 10 కుటుంబాలు స్థిరనివాసం ఏర్పరుచుకుని జీవనం సాగిస్తున్నాయి. ఇది లావుండగా ఆదివారం కొంతమంది పాత ఆసుపత్రి దారి ఆక్రమణలకు పాల్పడ్డారని, దీంతో తమకు దారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నట్టు స్థానికులు రామకుప్పం ఎస్‌ఐ శివకుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆక్రమణలను అడ్డుకోవడానికి ప్రయత్నించిన వారిపై ఆక్రమణదారులు దౌర్జన్యానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమారు 20 కుటుంబాలకు వెళ్లడానికి దారిలేక అవస్థలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా రెస్కో చైర్మన్ జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకల్లో రెస్కో చైర్మన్ సెంథిల్, చిత్రంలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ తదితరులు

కుప్పం: కుప్పం రెస్కో చైర్మన్ జీఎస్ సెంథిల్ కుమార్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక తిరుపతి గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ సమక్షంలో 600 కేజీ కేక్‌ను రెస్కో చైర్మన్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం ఆలయం ఎదుట పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. హెలికాప్టర్ ద్వారా సెంథిల్ కుమార్‌పై పూల వర్షం కురిపించారు.

కాలినడకన శ్రీవారి దర్శనానికి..



కాలినడకన తిరుమలకు బయలుదేరిన గోవిందమాల భక్తులు

రామకుప్పం: మండలంలోని కొర్లాలకొండ తండా, టేకుమాను తండా, బోరింగ్‌తండా, రామకుప్పం,విజలాపురం, పీఎంకే తండా, పెద్దూరుకు చెందిన శ్రీవారి భక్తులు ఆదివారం ఉదయం కాలినడకన తిరుమలకు బయలుదేరారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం గోవింద నామస్మరణతో భక్తులు కాలినడకను ప్రారంభించారు. దాదాపు 14 ఏళ్లుగా ప్రతి సంవత్సరం తిరుమలకు కాలినడకన బయలుదేరి వైకుంఠ ఏకాదశి రోజు శ్రీవారి దర్శనం చేసుకోవడం ఆనవాయితీ అని గోవిందమాల భక్తులు చెప్పారు. కార్యక్రమంలో గోవింద భక్తులు కోదండనాయక్ స్వామి, రామిరెడ్డి నాయక్‌స్వామి, రవినాయక్ స్వామి, నాగరాజుస్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో ధనుర్మాస పూజలు



ధనుర్మాసం పూజల్లో భక్తులు

బైరెడ్డిపల్లె: మండలంలో తీర్థం గ్రామంలోని శ్రీరామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస పూజలను భక్తిప్రపత్తులతో ప్రారంభించారు. ఉదయం ఆలయంలో సీతా రామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ధనుర్మాసం శ్రీ మహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన మాసమని అర్చకులు రాజేష్ ఆచార్యులు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు వారికి తీర్థప్రసాదాలను అందజేశారు.

అభివృద్ధికి వనరులు సమకూర్చుకోవాలి

- మండల సమావేశంలో సభ్యులు



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ తాజ్‌మస్రూర్

గుడుపల్లె: గ్రామాల అభివృద్ధికి ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు అందరూ కృషి చేయాలని పలువురు సభ్యులు కోరారు. ఆదివారం స్థానిక శ్రీశక్తి భవనంలో మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. పలువురు సభ్యులు సమస్యలపై మాట్లాడారు. మండలానికి, గ్రామ పంచాయతీలకు సకాలంలో ఆర్థిక వనరులు వచ్చేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ముఖ్యంగా మండలంలో గ్రానైట్ పనులు, డంపింగ్ ఇసుక, చెరువులలో మట్టి తరలింపు.. వంటి వ్యాపారాలు ఎక్కువగా చేస్తున్నారని, ఈ వ్యాపారాలు చేసే వారి నుంచి ప్రభుత్వానికి వనరులు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అడ్డదారిలో వ్యాపారాలు చేసేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మండలం, గ్రామ పంచాయతీకి వచ్చే నిధులు ఆలస్యం కావడంతో ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ తెలిపారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు సకాలంలో అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ శంకర్, డీటీ కిరణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.